ఆటంబాంబు పేలిన ఆ రోజు...

జపాన్ దేశంలోని హిరోషిమా పట్నంపై అమెరికా 1945 వ సంవత్సరం ఆగస్టు 6 వ తేదీ ఉదయం 8 గంటల 16 నిమిషాలకు ఆటంబాంబు వేసింది. తత్ఫలితంగా హిరోషిమాలో 1,18,000 (ఒక లక్షా పద్దెనిమిది వేల) మంది చనిపోయారు. మరో 22,000 మంది రోగగ్రస్తులై క్రమేపి మరణించారు.

మరో మూడు రోజుల తరువాత జపాన్‌లోని నాగసాకి అనే మరో పట్నంపై రెండో ఆటంబాంబు ప్రయోగించారు. అందువల్ల మొత్తం నాగసాకి పట్నంలో 1,40,000 (ఒక లక్షా నలభై వేల) మంది దారుణ మరణం పొందారు.

ఈ రెండు పట్నాలు ఈనాటికీ మనిషి దుష్ట స్వభావానికీ, రాక్షస కృత్యాల ఫలితానికి చిహ్నాలుగా వుండిపోయాయి.

రెండవ ప్రపంచ సంగ్రామం జరుగుతుంది. ఇంగ్లండ్, దాని మిత్ర దేవాలు ఎలాగైనా ఆ సంగ్రామాన్ని కొనసాగించక త్వరగా సమాప్తం చేయాలన్న కృషిలో భాగంగా కొత్తరకం ఆయుధాలను కనిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు మేధావులైన శాస్త్రజ్ఞుల సహకారంతో.

అమెరికన్ అధినేతల కృషి ఫలించింది. 1945 వ సంవత్సరం జులై 16 వ తారీఖున న్యూ మెక్సికోలోని మైదానంలో మొదటి అణుబాంబు ప్రయోగాన్ని చేశారు. దాని ప్రచండ శక్తికి వారే అత్యంతాశ్చర్యాన్ని పొంది యుద్ధంలో ఆ నూతన అస్త్రాన్ని వాడడానికి నిశ్చయించుకున్నారు.

తూర్పు ఆసియా ప్రాంతమంతా చీమల్లా ప్రాకిపోయి విజయోత్సాహంతో జపనీయులు గర్వపడుతున్న తరుణంలో అమెరికాకు చెందిన బి-29 బాంబర్ విమానం ఒకటి హిరోషిమా పట్నంపైకిపోయి, భూమికి 1900 అడుగుల ఎత్తుపై నుంచి మొదటి అణుబాంబును ప్రేల్చింది.

ఆ చుట్టుపక్కల మైళ్ళ కొద్ది కనిపించి కళ్ళు చెదరిపోయినట్టు చేసే కాంతి మెరసింది. ఆ కాంతి నుంచి అగ్నిగోళం ఉద్భవించి గొడుగులా చెదరి ఆ పట్నం మీద పడింది. దానితో నిమిషాల మీద సుమారు రెండు లక్షల జనాభాగల ఆ నగరం నేలమట్టమైన భవనాలతో, కాలిపోయిన జంతు, వృక్ష సముదాయంతో, లక్షకు పైగా దారుణంగా కాలి, బీభత్సంగా మహా శ్మశానంగా మారిపోయింది.

ఇంకా జీవం వున్నవారు 'దాహం, దాహం' అని అరుచుకుంటూ, కాలి బొబ్బలెక్కి వికృతంగా మారిన అవయవాలతో రోదిస్తూ ఆ శ్మశాన నగరం నుంచి వలసపోయారు. అణుబాంబు దుష్పరిణామం దేహంపైనే కాక, మెదడు పైన కూడా ఎంతగానో వుంటుంది.

ఇంతకీ హిరోషిమాపైన, నాగసాకిపైన వేసిన అణుబాంబులు చాలా చిన్నపరిమాణంలోనివి. వెయ్యిటన్నుల టి.ఎన్.టి. శక్తితో సమానమైన బాంబు ఒక కిలోటన్ ప్రయోగశక్తిని కలిగి వుంటుంది. హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు 12.5 కిలోటన్నుల శక్తి కలది. అలాంటిది ఇప్పుడు తయారవుతున్న అణుబాంబులు ఒక మెగాటన్ శక్తిగలవి. అంటే పది లక్షల టి.ఎన్.టి.ప్రయోగశక్తిగలవి. అంటే హిరోషిమాపై వేసిన బాంబు కన్నా 80 వంతుల ఎక్కువ శక్తి కలవి. ఫలితం మరెంత దారుణంగా వుంటుందో ఊహించుకోవచ్చు.

1945 ఆగస్టు 6 వ తేదీన మొదటి ఆటంబాంబు ప్రయోగం జరిగింది. దాని విష పరిణామాల వివరణ ఈ వ్యాసం.

హిరోషిమా, నాగసాకిలలో ప్రయోగించిన అణుబాంబులవలన సుదూర ప్రాంతాలలో సైతం మంటలు రేగి చాలా కష్టాన్ని, నష్టాన్ని కలిగించాయి. ఒక్కొక్కప్పుడు మిక్కుటమైన వేడివలన వాతావరణంలో మార్పులు కలిగి, భరింపరాని మంటల గాలి తుపాను రేగి సర్వాన్ని నాశనం చేయవచ్చు.

అన్నిటికన్నా ప్రమాదమైనది రేడియో ధార్మిక (రేడియేషన్) శక్తి పరిణామాలు. గాలిద్వారా, వాతావరణం ద్వారా ఈ రేడియేషన్ నాలుగు ప్రక్కలకూ వ్యాప్తిచెంది చాలా దుష్పరిణామాలను కలిగిస్తుంది. ఈ రేడియేషన్‌వలన జీవకోటి పీల్చేగాలి, త్రాగే నీరు, తినే పదార్థాలన్నీ కలుషితమై విషపూరితాలైపోతాయి.

మానవ శరీరాలపై దారుణంగా ఈ రేడియేషన్ పని చేస్తుంది. తల్చుకుంటేనే శరీరం గగుర్పాటు చెందుతుంది. ఎముకల్లో రంధ్రాలేర్పడుతాయి. కండరాలు బలాన్ని కోల్పోయి నీరు కారిపోతాయి, రోగ నిరోధక శక్తి కలిగించే తెల్ల కణాలు నాశనమై దేహాన్ని సర్వ వ్యాధులకు నిలయాలుగా మారుస్తాయి. కేన్సరు వ్యాధి సోకుతుంది. శరీరాన్ని కవచంలా కాపాడే చర్మం పగిలి రక్తం చిమ్ముతుంది. ఆఖరికి భరింపరాని బాధలకు గురిచేసి మరణం సంభవిస్తుంది.

—యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

కాలమ్ దాటని కథ

ఒక వారానికి అథమపక్షంగా మూడు తెలుగు సినిమాలైనా చూస్తుంటాడు దోబూచి. సెక్స్‌బాంబ్స్ సిల్క్, అనూ, డిస్కోలుంటే చాలు ఆ సినిమాను మొదటి రోజు, మొదటి ఆట చూడాల్సిందే! కేవలం తెరపిచ్చితోనే సరిపెట్టుకోక పెద్దలు చూసిన పిల్లను పెళ్లి చేసుకున్నాడు దోబూచి.

శోభనం రేయి అతను దరి చేరమంటుంటే "ఊహ్హా!" "ఆహ్హా!"లతో సిగ్గుపడ్తూ, చేతుల్లో ముఖం దాచుకుంది నూతన వధువు అమల.

తన సినిమా పరిజ్ఞానంతో భార్యను హుషారుపరచ చూశాడు దోబూచి. "సిగ్గు వొదిలేయబట్టే సిల్క్, అనూ, డిస్కో కోట్లాది జనానీకాన్ని ఆకట్టుకుంటున్నారు. మన పడగ్గదివరకైనా వాళ్లలా నువ్వు ఒళ్లంతా కనిపించే ఉడుపు లేసుకో! నన్ను వాటేసుకో!"

వైరుధ్యం

పోయిపోయి ఆ భరితెగించిన ఆడవాళ్లలా తనను నడుచుకుంటావా అని అడుగుతాడేమాని "ఛీ పాడూ" అంది అమల డోకొచ్చినంత పనిగా.

పెళ్లిచూపులనాడు బుద్ధిగా కనిపించిన ఈ మనిషిలో ఇంత చీప్ టేస్ట్ వుందా? చిన్నప్పట్నించీ కట్టుబాటులో ఎదిగిన తను ఇప్పటికిప్పుడు ఇతను చెప్పినట్టు మారడం సాధ్యమా? ఆమె డోలాయమానంగా అలా వుంటే—

ఎంతకూ మొగ్గు చూపదేం అని కోపతాపాలతో ఊగిపోయాడు దోబూచి. పెళ్లిచూపులనాడు ఈవిడ సిగ్గుపడ్తూ క్రీగంట చూస్తే సిల్క్ చూపనీ, పట్టుచీరె, బంగారు నగల నిండుతనం పొందికకు అనూను పోల్చుకున్నాడు. ఇక తన జీవితం రంగరంగ వైభోగమే అని మురిసిపోతుంటే ఇలా బిగుసుకున్నదేం చెప్మా? చివరి అస్త్రంగా ద్వంద్వార్థాల పచ్చి శృంగార సినీ మార్కు డైలాగులతో ఆమెను రెచ్చగొట్టి దారిలోకి తెచ్చుకోచూశాడు. అతని నానా ఛండాలపు కూతలు వినలేక ముఖం చిట్లిస్తూ చెవులు మూసుకుంది అమల.

అలా కూడా కుదరకపోయేసరికి తను చూసిన శృంగార, క్రైం అవాస్తవిక సినీ 'రేప్' పోకడలన్నీ ఆమె మీద ప్రయోగించాడు దోబూచి.

"ఇలాంటి శోభనం రేయి పగవారికి కూడా వద్దు దేవుడా!" విలవిలలాడింది అమల.

ఆమె తలచుకున్న ఆ దేవుడు మాత్రం వారిని పోలిన ఎన్నో వైరుధ్యంగల జంటల్ని కలిపి వినోదిస్తున్నాడు.

—వి.ఎం.ఎస్.స్వాతి